పోలవరంలో వైఎస్సార్ సీపీదే గెలుపు



ఎన్నికల ప్రచారంలో భాగంగా ముప్పినవారిగూడెంలో ఇస్త్రీ చేస్తున్న రాజ్యలక్ష్మి



ముప్పినవారిగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బాలరాజు, అభ్యర్థి రాజ్యలక్ష్మి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి
- బుట్టాయగూడెం మండలంలో ఎన్నికల ప్రచారం

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో పోలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎరగడం ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. బుట్టాయగూడెం మండలంలోని కోటనాగవరం, ముప్పినవారిగూడెం, శ్రీరామపురం, కె. అంకంపాలెం, చెంచుగూడెం, గవరవరం, తదితర గ్రామాల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న తనకు పోలవరం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన ముఖ్యమంత్రి జగనన్నకు రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం రాజ్యలక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. తన గెలుపునకు ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలే దోహదపడతాయని అన్నారు. గ్రామాల్లో పర్యటించినప్పుడు ప్రజలు తమకు అందిన పథకాల గురించి చెప్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగనన్నను మళ్లీ గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కాగా ఎన్నికల ప్రచార సమయంలో అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, బాలరాజులకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. హారతులు ఇచ్చి మరీ గ్రామాల్లోకి ఆహ్వానించారు. పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారితో కలిసి పనిచేస్తూ రాజ్యలక్ష్మి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తెల్లం వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్ పెడకం విజయలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ బాజీ, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, నాయకులు తాళ్లూరి ప్రసాద్, మేకరబోయిన చిన్నసత్యనారాయణ, రేపాకుల చంద్రం, కలగర నాని, కుక్కల రాంపండు, జిత్తుక సురేష్, కుక్కల లక్ష్మణరావు, కళ్ళే మధు, ఆడమిల్లి సోమరాజు, చీమల శ్రీను, పంపన నాగబాబు, పంపన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్ ప్రభంజనం ఖాయం

ఎన్నారై, ఐటీ విభాగం రాష్ట్ర నాయకుడు బద్రి

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభ ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోందని వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగం రాష్ట్ర నాయకుడు పసుపులేటి వీరభద్రరావు (బద్రి) అన్నారు. శ్రీవారి క్షేత్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్నకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. జగనన్న చేపట్టిన బస్సు యాత్రలు కారణంగా ఇక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు కంటిమీద కునుకు ఉండదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మళ్లీ ప్రభంజనాన్ని సృష్టించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్టు చెప్పారు. గోదావరి జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో జగనన్న ప్రచారాన్ని ఏర్పాటు చేయాలని ఆయనను కోరినట్టు తెలిపారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



జీలుగుమిల్లిలో సాయుధ దళాలు కవాతు చేస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

జీలుగుమిల్లిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది, సాయుధ దళాలతో కలిసి బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు వారి ఓటు హక్కును నిర్భయంగా పక్షపాతం లేకుండా వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అలాగే ప్రజలకు భరోసా కల్పిస్తామని చెప్పారు. ఎన్నికల నిబంధనలను ప్రజలు, రాజకీయ పార్టీలవారు పాటించాలని అన్నారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ప్రయాణం చేసే సమయంలో సరైన ధ్రువపత్రాలను పోలీస్ వారికి తెలియపరచాలని అన్నారు. లేకుంటే ఆ డబ్బును స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని చెప్పారు. అలాగే ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎదుటివారి ఓటును వినియోగించుకునే విషయాల్లో ఆటంకాలు సృష్టించరాదని చెప్పారు. అలాగే ఫలానా పార్టీకే ఓటు వేయాలని బెదిరించడం లేదా ప్రలోభాలకు గురి చేయడం వంటి పనులు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై కూడా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం పట్టణంలోని ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, తహసీల్దార్ కే. స్లీవజోజి, ఎస్సై జ్యోతి బాస్ సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్లీవ జోజి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా అనుమతి లేకుండా వాహనాలకు పార్టీల జెండాలు కట్టరాదని తెలిపారు. రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బు వ్యక్తుల వద్ద గానీ, వాహనాల్లో గానీ ఉండరాదని అలా ఉంటే వాటికి తప్పనసరిగా సంబంధిత ఆధారాలు ఉండాలని, లేకపక్షంలో ఎన్నికల నిబంధనల ప్రకారం డబ్బు సీజ్ చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం - కన్నాపురం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్లో నూతనంగా పునర్నిర్మిస్తున్న శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 42 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయాన్ని తొలగించి అదే స్థలంలో అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో అమ్మవారి ఆలయ నిర్మాణం చేపట్టినట్లు పాలకమండలి అధ్యక్షుడు మంతెన సోమరాజు తెలిపారు. అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని ప్రస్తుతానికి బాలాలయంలో ఉంచి నిత్య పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనేపథ్యంలో ధ్వజస్తంభం, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, ఆంజనేయ స్వామి విగ్రహాలను కూడా ఆలయంలో ఉప మందిరాలుగా ప్రతిష్టిస్తున్నామన్నారు. ఏప్రిల్‌లో ఆలయ ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు.



కొయ్యలగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం

కార్పెంటర్స్ డే

కొయ్యలగూడెం: శ్రీ కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్పెంటర్స్ డే సందర్భంగా బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా ఈదఫా బాలుర, బాలికల హైస్కూళ్లలో మరమ్మతులకు గురైన సామగ్రిని రిపేరు చేసి ఉపయోగంలోకి తీసుకువచ్చారు. ఎన్నికల నేపథ్యంలో కార్పెంటర్స్ అభ్యున్నతికి పాటుపడే వారిని ఎన్నుకోవాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలలోని ఫర్నిచర్స్ సామగ్రిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ముందుగా గవరవరంలోని శ్రీ కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆశ్రమం వద్ద బ్రోచర్స్ విడుదల చేసి కేక్ కటింగ్ చేశారు.



బ్రోచర్లను విడుదల చేసిన అసోసియేషన్ నాయకులు

పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ తీసుకోండి

భీమడోలు: పిల్లల భవిష్యత్తు పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ట్రైనీ డీఎస్పీ బి.విద్య సూచించారు. పదో తరగతి పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు బుధవారం వేసవి సెలవుల్లో మైనర్లు బైక్ డ్రైవింగ్, అతివేగం, ప్రమాదాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్య ఆధ్వర్యంలో సీఐ బీబీ రవికుమార్ నేతృత్వంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. లైసెన్సులు లేకుండా బైక్ నడిపే పలువురు మైనర్ల నుంచి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం భీమడోలు పోలీస్ స్టేషన్‌లో మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. డీఎస్పీ విద్య మాట్లాడుతూ పరీక్షలు ముగిసినందున తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల్లో మైనర్లు రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొని భవిష్యత్తును నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ లైసెన్స్ పొందాలని సూచించారు. సీఐ బీబీ రవికుమార్ మాట్లాడుతూ ఏటా సెలవుల్లో మైనర్లు బైక్‌లు నడిపి ప్రాణాలు కోల్పోవడం, ఇతరుల ప్రాణాలు పోగొట్టడం, క్షతగాత్రులు కావడం వంటి ఘటనల నేపథ్యంలో తల్లిదండ్రులను మేల్కొల్పేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై వై.సుధాకర్, పోలీస్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న పోలీస్, హోంగార్డు సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ డి.మేరి ప్రశాంతి చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవి విరమణ చేసిన హోంగార్డుకు హోంగార్డు ఫండ్ నుంచి ఆర్థిక సాయం ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. పదవి విరమణ చేసిన హోంగార్డు టి.కోటేశ్వరరావుకు రూ.5,50,960 చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం విషయంలో రాజీ పడే అవకాశం లేదని, విధుల్లో ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. హోంగార్డులు మరణిస్తే వారి కుటుంబంలో అర్హత గల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపడుతూ ఆదుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ పవన్‌కుమార్, ఏఆర్ఎస్సై వి.శ్రీనివాసరావు తదితరులున్నారు.

బలం లేకే చంద్రబాబు పొత్తులు

టి.నరసాపురం: నా పరిపాలన చూసి ఓటేయమనే అడిగే ధైర్యం, హక్కు చంద్రబాబుకు లేదని, బలం లేకే ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుంటున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. మండలంలోని తిరుమలదేవిపేటలో బుధవారం సాయంత్రం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలరాజు మాట్లాడుతూ ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా పనిచేయాలని కార్యకర్తలను హెచ్చరించారు. ఎన్నికల్లో మన పని మనం చేయాలని, మన కష్టం మనం పడాలని దిశా నిర్దేశం చేశారు. బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. ఎన్నికలు అయ్యేంత వరకు ప్రతిరోజు గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించాలని సూచించారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టో ప్రకటించనున్నారని, ఆ మ్యానిఫెస్టోను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీలో చిన్న చిన్న మనస్పర్థలు, భేదాభిప్రాయాలు ఉండటం సహజమని, వాటన్నింటిని పక్కన పెట్టి పనిచేయాలని సూచించారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, మాజీ ఎంపీపీ కొత్త ప్రకాష్‌బాబు, దేవరపల్లి ముత్తయ్య, యర్రా గంగాధరరావు, కన్నం సర్వేశ్వరరావు, దాసరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



తిరుమలదేవిపేటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

చింతలపూడిని జగన్‌కు కానుకగా ఇవ్వాలి

లింగపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో చింతలపూడిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని స్టేట్ లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ధర్మాజీగూడెంలో పార్టీ నేత మందలపు వేణు నివాసం నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నవీన్ బాబు, చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి అందించటం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ కృతజ్ఞత భావంతో వైఎస్ జగన్‌కు ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో వారి స్వార్థం కోసం ఒకరిద్దరు పార్టీని వీడి వెళ్లినా అంతకన్నా ఎక్కువ మంది వేరే పార్టీ నుంచి నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి రావటం జరిగిందన్నారు. అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజును అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, .పార్టీ నాయకులు రావి కొండయ్య, మందలపు నరిశింహరావు ఉన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ నవీన్‌బాబు, పార్టీ నేతలు

ఘనంగా రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదపాడు : పెదపాడు మండలం సత్యవోలు గ్రామంలో దాతల సహకారంతో గంగా పార్వతీ సమేత శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు ఆలయంలోని యంత్ర, విగ్రహ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కళాన్యాసం, కుంభాన్న దర్శనం, దృష్టిగోవు దర్శనం, భక్తులకు శివమూర్తి తొలి దర్శనం యాగశాలలో మహాపూర్ణాహుతి, అగ్ని ప్రదక్షణం, ఆచార్య బహుమతి, అగ్రిభస్మధారణ, శిఖర కుంభాభిషేకం, స్వామివార్ల శాంతికల్యాణం యజమానుల దీక్షా విమోకం, అవబృంధం, నూతన వస్త్రధారణం, ఆశీర్వాచకం నిర్వహించారు. యాగాధ్వర్యులు యలమంచిలి కృష్ణమూర్తి వివాచార్య, యలమంచిలి ప్రసాదశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11 గంటలకు భారీ అన్నసమారాధన దాతల సహకారంతో ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు బొమ్మి ప్రభాకరరావు, సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, టంగుడు ఆంజనేయులు, కొట్నాన వెంకట్రావు, గండివలస బాలకృష్ణ, గండివలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సత్యవోలులో శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

దెందులూరు: అన్నిరాజకీయ పార్టీలు భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనలు పాటించాలని, గౌరవించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బి.లావణ్యవేణి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. నిబంధనలు వివరించారు. రోజువారి రిజిష్టర్లు సరైన పద్ధతిలో నిర్వహించాలన్నారు. రిజిష్టర్లు, ఓచర్లు ప్రతి మూడు రోజులకోసారి తనిఖీ చేయించుకోవాలని, పర్మిషన్లు సరైన పద్ధతిలో పొందాలని, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని వివరించారు. నామినేషన్ల నుంచి ఫలితాలు ప్రకటించే తేదీ వరకు అయిన ఖర్చులు అభ్యర్థికి వర్తిస్తాయన్నారు. నామినేషన్‌కు ముందు అయిన ఖర్చు పార్టీ పేరున నమోదవుతాయన్నారు. ఫలితాలు ప్రకటించిన రోజున అన్ని రిజిష్టర్లు, ఓచర్లు, బిల్లులు, కార్యాలయానికి సమర్పించాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ వి.జితేంద్ర, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ కన్వీనర్‌గా నాగూర్



ఎస్‌కే నాగూర్

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ మండల మైనార్టీ సెల్ కన్వీనర్‌గా ఎస్‌కే నాగూర్‌ను నియమించినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు బుధవారం పేర్కొన్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు నాగూర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన ఎస్‌కే నాగూర్ పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో మైనార్టీ శాఖలకు చెందిన అన్ని వర్గాల వారిని కలుపుకుని వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తానని నాగూర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం



దాత నరసింహాచారికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఎస్ గొల్లగూడెంకు చెందిన పుల్లూరి నరసింహాచారి ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి ప్రథమ చికిత్సా కేంద్రానికి మందుల అందజేత



శ్రీవారి ఆలయ ప్రథమ చికిత్సా కేంద్రంలో మందులను అందజేస్తున్న సునీల్

ద్వారకాతిరుమల: ప్రాణదాన ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీవారి దేవస్థానం నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రానికి ఒక దాత 2 వేల మంది భక్తులకు సరిపడా మందులను బుధవారం ఉచితంగా అందజేశారు. తెనాలికి చెందిన దాత ఏవీ సాంబశివరావు సహాయంతో, హైదరాబాద్‌కు చెందిన సురక్ష ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు సునీల్, అనీల్ ఈ మందులను ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్‌లకు అందజేశారు. ఈ మందులను కాలినడక భక్తులకు వినియోగించాలని ఈ సందర్భంగా వారు కోరారు. దాతలను ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు ప్రత్యేకంగా అభినందించారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ ఎన్‌డీపేట పంచాయతీ పరిధిలోని సరిపల్లికుంట అటవీప్రాంతంలో సారా బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. అలాగే 50 లీటర్ల సారాను కూడా ఆ ప్రాంతంలో స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు.

క్షతగాత్రుడికి సాయం



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకువెళ్లిన రవి

కొయ్యలగూడెం: రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఉన్న క్షతగాత్రుడికి వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు, వార్డ్ మెంబర్ పూలపల్లి రవి సకాలంలో వైద్య సేవలు అందించడంలో సహకరించాడు. వివరాల్లోకి వెళితే కొయ్యలగూడెం - జంగారెడ్డిగూడెం రోడ్డులో బుధవారం మధ్యాహ్నం ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం వైపు వస్తున్న అశోక్ నగర్ ప్రాంతానికి చెందిన కొల్లూరు కిరణ్ మరొక బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో కిరణ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వచ్చేసరికి జాప్యం అవుతుందనే ఉద్దేశంతో క్షతగాత్రుడిని అక్కడే వున్న రవి తన బైక్‌పై కూర్చోబెట్టుకుని హాస్పిటల్‌కి తీసుకువెళ్లాడు. వెంటనే ప్రథమ చికిత్సను అందించడంలో సహకరించాడు. అనంతరం క్షతగాత్రుడ్ని మెరుగైన వైద్యం నిమిత్తం మరో హాస్పిటల్‌కు తరలించారు.

ఉపాధి పనులు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామ పంచాయతీల్లోని పేదలకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. చొదిమెళ్ల, కొమడవోలు, శనివారపుపేట, పోణంగి గ్రామాల పేదలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

టి.నరసాపురం: ఈనెల 18వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో టి.రామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 4 సెంటర్‌లలో పరీక్షలు జరిగాయన్నారు. బుధవారం జరిగిన సోషల్ స్టడీస్ పరీక్షకు 538 మంది విద్యార్థులు హాజరుకాగా 51 మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షలు ప్రశాతంగా నిర్వహించేందుకు సహకరించిన ఆయా అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

9న 'మనస్సాక్షి' బహిరంగ సభ

పోలవరం రూరల్: ఓటర్లలో ఉత్తేజం నింపేందుకు ఏప్రిల్ 9న మనస్సాక్షి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ప్రజాసత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌ఏ వలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజల్లో చైతన్యం నింపేందుకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి గురునాధరావు అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథులుగా పోలవరం ఎమ్మెల్యే తెల్లం బలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమురి సునీల్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజాప్రతినిధులు, జగన్ అభిమానులు, కార్యకర్తలు, మహిళామండలి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు



విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి కళాశాలలో బుధవారం విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు వారి బ్లడ్‌గ్రూప్ ఏమిటో తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాద సమయంలో గాని, అత్యవసర పరిస్థితుల్లో గాని రక్తదానం చేయాలన్నా, రక్తం కావాలన్నా బ్లడ్‌గ్రూప్ తెలియడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. జువాలజీ విభాగం అధినేత ఆర్.విజయదీపిక ఆధ్వర్యంలో వంద మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కళాశాల ఐక్యూసీ కోఆర్డినేటర్ ఎం.మధు, అధ్యాపకులు సీహెచ్ బద్రీ నారాయణ, సీహెచ్ వెంకటాచార్యులు, టి.ఝాన్సీరాణి, సీహెచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.